క్లుప్తంగా

రాంజల చెరువు పరిశీలన



సీసీ రోడ్డు, సైడ్ ప్లాట్ ఫాంను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదోనిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రాంజల నల్లచెరువును కమిషనర్ రామచంద్రారెడ్డి శుక్రవారం సందర్శించారు. చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన ప్రహరీ, సీసీ రోడ్డు, ప్లాట్‌ఫాంను పరిశీలించారు. పనులు వేగంగా జరిగాయని, మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

వైద్య శిబిరంలో 40 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదోనిఅర్బన్: స్థానిక జీవనజ్యోతి ఆశ్రమంలో 40 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సాయి కృష్ణ కంటి ఆస్పత్రి వైద్యులు కృష్ణమూర్తి, ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ గోపీనాథ్, వృద్ధాశ్రమం నిర్వాహకుడు ఫిలిప్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని.. వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఆదోని పట్టణంలోని 7 సెంటర్లలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,592 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2865 మంది పరీక్షలు రాశారు. చివరి పరీక్ష అనంతరం విద్యార్థులు సంతోషంతో పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిరూరల్: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం మేజర్ పంచాయతీ మండిగిరిలోని తిరుమలనగర్‌లో గడప గడపకు సంక్షేమం పేరుతో అందిన పథకాల గురించి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. హరిదాసు, కోటిరెడ్డి, శ్రీధర్‌యాదవ్, అలీదాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



హాన్వాల్‌లో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఆదోనిరూరల్: రానున్న ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘటనలు చేటు చేసుకోకుండా, ప్రజలు తమ ఓటు హక్కులను ధైర్యంగా వినియోగించుకునేలా గ్రామాల్లో కేంద్ర ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. మండలంలోని హాన్వాల్, కడితోట, జి.హొసళ్లి గ్రామాల్లో శుక్రవారం కవాతు నిర్వహించినట్లు ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐలు చిన్నపీరయ్య, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



పత్తికొండ బైపాస్‌రోడ్డులో మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పత్తికొండ రూరల్: పత్తికొండ–హోసూరు బైపాస్ క్రాస్ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న హర్యానా మద్యం 20 బాటిళ్లను (750ఎంఎల్) సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సీఐ స్వర్ణలత వివరాలను వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా బైక్‌పై మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేయగా వీరిలో ఒకరు ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉన్నారన్నారు. మద్యం తరలిస్తున్న బైక్‌ను సీజ్ చేశామన్నారు. దీంతో పాటు వివిధ కేసుల్లో పట్టుబడిన 140 లీటర్ల నాటుసారా, 317 లీటర్ల కర్ణాటక మద్యం (టెట్రా ప్యాకెట్లు) పత్తికొండ బైపాస్ రోడ్డులో సిబ్బందితో కలిసి ధ్వంసం చేసినట్లు తెలిపారు.

వేగంగా వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల పనులు

- మండలంలో 24 కేంద్రాల నిర్మాణాలు
- ఇప్పటికే 10 కేంద్రాలు పూర్తి
- ఇంకో నాలుగు నిర్మాణాలు చివరిదశలో, మరో 6 బేస్‌మట్టం స్థాయిలో



గణేకల్, మాంత్రికిలో ప్రారంభించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం





జి.హొసళ్లిలో రూఫ్‌లెవెల్‌లో నిర్మాణం సాగుతున్న భవనం



మండిగిరిలో బేస్‌మట్టం స్థాయిలో..

ఆదోని రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను చేపట్టింది. ఇందుకు ఒక్కో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి రూ.17.50 లక్షలతో పనులు చేపట్టింది. మండలంలో మొత్తం 44 గ్రామాలు, 41 పంచాయతీలు ఉన్నాయి. 41 పంచాయతీల్లో 37 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 24 పంచాయతీలకు వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. వాటిలో 10 కేంద్రాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో 4 రూఫ్ లెవెల్‌లో ఉండగా, ఇంకో నాలుగింటి నిర్మాణాలు చివరిదశలో ఉండగా ఆరు బేస్‌మట్టం స్థాయిలో పనులు జరుగుతున్నాయి. బల్లేకల్, ఇస్వీ, ఢణాపురం, జి.హొసళ్లి గ్రామాల్లో క్లినిక్‌ల నిర్మాణాలు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయి. కుప్పగల్, మండిగిరి, పెద్దహరివాణం, విరుపాపురం, బైచిగేరి దిబ్బనకల్ బేస్‌మట్టం లెవెల్‌లో ఉన్నాయి.

పనులు వేగవంతం చేస్తాం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తోంది. ఈ కేంద్రాల నిర్మాణ పనులు మండలంలో చేపడుతున్నాం. ఇప్పటికే గణేకల్, మాంత్రికి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తికాగా ఎమ్మెల్యే ప్రారంభించారు. మిగిలిన నిర్మాణాలు త్వరలోనే పూర్తవుతాయి.



– మాలిక్‌బాషా, పంచాయతీరాజ్ ఏఈ

సురక్షలో ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు



పరీక్షలు చేయించుకుంటున్న గర్భిణులు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేస్తారని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇమ్మానియల్ అన్నారు. శుక్రవారం చిరుతపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2, కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 250 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 8 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఐదుగురిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలకు సమాధానం చెబుతున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిటౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే కౌన్సిల్ లక్ష్యమని చైర్‌పర్సన్ బోయ శాంత తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ హాల్‌లో మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిలర్‌లు బాలాజీ, సందీప్‌రెడ్డి, వసీం మాట్లాడుతూ ఎండాకాలం దృష్ట్యా పట్టణంలో తాగునీరు ఎక్కువగా వృథా అవుతున్నాయని, కుళాయిలకు బిరడాలను ఏర్పాటు చేయాలని, పైపులైన్ లీకేజీలను సరిచేసి వృథాను అరికట్టాలని కమిషనర్‌ను కోరారు. జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసి, పత్రాలను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్లలో పేర్లు మార్పు, తప్పిదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వాటిని సవరించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని కమిషనర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఆదోని సెంట్రల్: ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని ఇందుకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని ఎస్టీయూ అసోసియేటెడ్ అధ్యక్షుడు పి.నాగేంద్రప్ప కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. కేంద్రాలలో తాగునీరు, ఫర్నీచర్ వంటివి సమకూర్చాలన్నారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ ఈఓ తెలిపారు. నాయకులు నారాయణ, వెంకటేశులు ఉన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



దుద్దిలో బోరు వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో తాగునీటి బోరు వేయించినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు దుద్ది నాగేష్, వీరేష్, రామలింగ, నాగేంద్ర తెలిపారు. శుక్రవారం గ్రామంలో తాగునీటి బోరుకు పూజలు చేసి పనులు ప్రారంభించారు. వేసవి కాలం కావడంతో గ్రామంలోని ఓ బోరుబావి అడుగంటి పోయిందని కొత్తగా మరోబోరు వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించి బోరు బండిని పంపించి దుద్ది రిజర్వాయర్ సమీపంలో బోరు వేయించారని చెప్పారు. నీరు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా గిరక బండ్ల పోటీలు



గిరక బండ్ల పోటీలు



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నాయకులు

కౌతాళం: గ్రామ దేవత మారికాంబ దేవర సందర్భంగా శుక్రవారం గిరక బండ్ల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో కౌతాళంకు చెందిన జుమ్మాలదిన్నె గాదిలింగప్ప వృషభాలకు రూ.25 వేలు, ద్వితీయ స్థానం కౌతాళంకు చెందిన కబాడి హరిష్ వృషభాలు రూ.20వేలు, మూడో స్థానంలో బాపురం ఉసేనికి రూ.15వేలు, నాల్గో స్థానం ఉరుకుందకు చెందిన ఎల్లప్పకు రూ.10 వేలు, ఐదో స్థానంలో రౌడురుకు చెందిన కృష్ణారెడ్డి వృషభాలకు రూ.5 వేలను కమిటీ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహల్లదచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కమిటీ నిర్వాహకులు ఉసేని, పింజారి బాబు పాల్గొన్నారు.

ఓబులేసు స్వామి ప్రభోత్సవం



తొగలుగల్లులో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో శుక్రవారం ఓబులేసు స్వామి ప్రభోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఓబులేసు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. ప్రభపై ఓబులేషు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిని అధిష్టించి భక్తులు స్వామివారి నామస్మరణతో గ్రామం నుంచి కొండవరకు లాగారు. నందికోలు, బుక్కపిండి సేవ, నుగ్గులాట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆనందోత్సవాల మధ్య వసంతోత్సవం జరుపుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ

పెద్దకడబూరు: వంట ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓలు సువర్ణల సునీయం, రామమూర్తి అన్నారు. మండల పరిధిలోని బసలదొడ్డి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, టీచర్ డైరీలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు పాఠశాలలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు మోటివేట్ చేయాలన్నారు. గ్రామంలో బడి బయట పిల్లలు లేకుండా చూడాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



మృతులు షమీర్, బడేసాబ్

మంత్రాలయం: మండల కేంద్రంలోని మాధవరం జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెట్రోలు బంకు సమీపంలో ట్రాక్టర్, ఐచర్ డీసీఎం వాహనం ఢీకొనడంతో డ్రైవర్లు ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతులు మంత్రాలయం మండల రామచంద్రనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తెలుగు బజారి కొడుకు బడేసాబ్(40), మహారాష్ట్రకు చెందిన ఐచర్ డ్రైవర్ షమీర్(36)గా గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మంత్రాలయానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ డీజిల్ కోసం వ్యాసరాజాచార్ పెట్రోలు బంకులోకి వెళ్లి బయటకు వస్తుండగా ఐచర్ వాహనం ఢీకొన్నట్లు తెలిసింది. ఇరువురి మృతదేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పథంలో చింతకుంట

- మారిన గ్రామ రూపురేఖలు
- ఆర్‌బీకే, హెల్త్ క్లీనిక్, సచివాలయాలతో సేవలు
- వివిధ పథకాలతో గ్రామస్తులకు రూ.16.18 కోట్ల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న పల్లెవాసులు



రూ.17.50లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్



కోసిగి: మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలోని గ్రామం చింతకుంట. గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. గుంతల రోడ్లు.. వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు, ఏ చిన్న అవసరం ఉన్నా మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామ రూపురేఖలు మారిపోయాయి. సీసీరోడ్లు, పాఠశాల భవనాలు, సచివాలయాలు, డ్రైనేజీ కాలువలతో పాటు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.3 కోట్లతో కోసిగి నుంచి చింతకుంట గ్రామం మీదుగా పల్లెపాడు, మాలపల్లి వరకు తారురోడ్డు నిర్మాణం చేశారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు

- గ్రామంలోనే పేదలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ ఏర్పాటు చేశారు.
- ఇంటి వద్దకే అన్నీ సేవలు అందించేందుకు రూ.40 లక్షలతో సచివాలయం నిర్మించారు. రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సచివాలయ, వలంటీర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో గ్రామంలోనే సేవలు అందిస్తున్నారు.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం.
- గడప గడప మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలు కేటాయించారు. ఆ నిధులతో చింతమలమునిస్వామి గుడి నుంచి బీసీ కాలనీ వరకు రోడ్డు.
- రూ.10లక్షలతో బోర్లు వేయించి తాగునీరు సరఫరా చేస్తున్నారు.
- నాడు–నేడు కింద రూ.1.10 కోట్లతో అదనపు గదులు, కాంపౌండ్‌వాల్, మరమ్మతులు, ఫర్నీచర్ ఏర్పాటు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



మాది చింతకుంట గ్రామం. కోసిగి నుంచి మా గ్రామానికి 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్డు వేయించారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేసి గ్రామాన్ని సుందరంగా మార్చారు. గ్రామాన్ని అన్నీ విధాల అభివృద్ధి చేశారు. కృతజ్ఞతలు. –ఎర్రదొడ్డి చిన్న నరసయ్య, చింతకుంట

చాలా సంతోషం



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక పరిపాలన చాలా బాగుంది. గతంలో చిన్న పని కోసం మండల కేంద్రం కోసిగి పోవాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామంలో అన్నీ రకాల సేవలు అందుతున్నాయి. వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. ఇతర సంక్షేమ పథకాలు ఖాతాల్లో పడుతున్నాయి. గ్రామంలో సచివాలయం, హెల్త్ క్లీనిక్, రైతు భరోసా సేవలు బాగున్నాయి. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మా గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డు వేయించడం సంతోషకరంగా ఉంది. –ఈరన్న, చింతకుంట



చింతకుంట గ్రామం మీదుగా ఏర్పాటు చేసి రోడ్డు



నాడు–నేడు నిర్మిస్తున్న పాఠశాల భవనాలు



గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీ